ఊరూరా బెల్ట్ షాపులు!

- గ్రామాల్లో యథేచ్ఛగా నిర్వహణ
- కూరగాయల దుకాణాల కంటే బెల్ట్ దుకాణాలే అధికం
- మద్యం దుకాణాల్లో లభించని బ్రాండ్లు సైతం లభ్యం
- నామమాత్రంగా దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్, సివిల్ పోలీసులు

జూపాడుబంగ్లా: గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే బెల్ట్ తీస్తానంటూ స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెచ్చరించినా గ్రామాల్లో అధికార పార్టీ నాయకులే యథేచ్ఛగా బెల్టుదుకాణాలు నిర్వహించి మద్యం అమ్ముతున్నా పట్టించుకొనేనాథుడే కరువయ్యారనే విమర్శలున్నాయి. కొన్ని గ్రామాల్లో కూరగాయల దుకాణాల కంటే బెల్టుదుకాణాలు అధికంగా ఉండటం విశేషం. కూరగాయాలైనా లభించవుకాని బెల్టుదుకాణాల్లో మద్యం 24గంటలు లభిస్తుంది. ఇంకో విచిత్రం ఏమంటే మద్యం దుకాణాల్లో లభించని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక లకు చెందిన పలురకాల బ్రాండ్ల మద్యం సైతం ఈ బెల్ట్ దుకాణాల్లో అందుబాటులో ఉంటుంది. గ్రామాల్లో యథేచ్ఛగా బెల్ట్ దుకాణాలు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్నా ఎక్సైజ్ పోలీసులు, సివిల్ పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.



ఓ బెల్ట్ దుకాణంలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన మద్యం సీసాలు



బెల్ట్ దుకాణంలో చెత్తసేకరణడబ్బాల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన మద్యం సీసాలు

285లకు పైగా బెల్ట్ దుకాణాలు

నందికొట్కూరు నియోజకవర్గం వ్యాప్తంగా 77 గ్రామపంచాయతీలుండగా వాటిల్లో ప్రతి గ్రామంలో ఐదుకు పైగా బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఈ లెక్కన 285లకు పైగా బెల్టుదుకాణాలు నిర్వహిస్తున్నారంటే ఆశ్చర్యం కలగకమానదు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహిస్తుండగా ఓ వ్యక్తికి కేవలం మూడు క్వార్టర్ సీసాలు మాత్రమే విక్రయించేవారు. దీంతో గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు నిర్వహించేందుకు ఆస్కారం ఉండేది కాదు. ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు పాలనలో మద్యం దుకాణాలు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించటంతో వారు ఓ వ్యక్తి ఎన్ని మద్యం సీసాలు కోరితే అన్ని విక్రయిస్తున్నారు. అంతేకాకుండా పర్సెంటేజీలు తీసుకొని గ్రామాల్లో బెల్టుదుకాణాల నిర్వాహకులకు కోరినన్ని మద్యం సీసాలు అందజేస్తున్నారు. దీంతో యథేచ్ఛగా గ్రామాల్లో బెల్ట్‌దుకాణాలు నిర్వహిస్తున్నారు.

మద్యం ప్రియుల జేబులకు చిల్లులు

గ్రామాలు మండలకేంద్రాలకు దూరంగా ఉండటంతో మండల కేంద్రాల్లోని మద్యం దుకాణాల వద్దకు వద్దకు వచ్చి మద్యం కొనుగోలు చేయలేని వారు గ్రామాల్లోని బెల్ట్ దుకాణాలపైనే ఆధారపడుతున్నారు. దీనికితోడు మద్యం దుకాణంలో కంటే బెల్ట్ దుకాణాల్లో ఏపీ, తెలంగాణ, కర్ణాటక లకు చెందిన పలురకాల నాణ్యమైన బ్రాండ్ల మద్యం లభిస్తుండటంతో మద్యం ప్రియులు అధికంగా వాటినే ఆశ్రయిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకుంటున్న బెల్ట్‌దుకాణాల దారులు క్వార్టర్ సీసాపై రూ.50 నుంచి రూ.100లు అధికధరతో విక్రయిస్తున్నారు. దీంతో మందుబాబులు జేబులు ఖాళీ చేసుకుంటున్నారు.

నియోజకవర్గం వ్యాప్తంగా బెల్టుదుకాణాల వివరాలు ఇలా...

మండలం పేరు	గ్రామాల సంఖ్య	బెల్టు దుకాణాల సంఖ్య
జూపాడుబంగ్లా	18	45
పగిడ్యాల	21	48
మిడుతూరు	24	49
నందికొట్కూరు	15	36
పాములపాడు	26	52
కొత్తపల్లి	39	55
మొత్తం	143	285

క్లుప్తంగా

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దాత హుసేన్‌బాషా

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో క్రీడాకారులకు గ్రామానికి చెందిన హుసేన్ బాషా అనే యువకుడుకబడ్డీ క్రీడా దుస్తులను సోమవారం పంపిణీ చేశారు. క్రీడాకారులు ఆటలో మంచి నైపుణ్యం కనబరచాలని చెప్పారు. టోర్నమెంట్లలో విజయాలు సాధించి గ్రామానికి పేరు తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ వేణు, ఇబ్రహీం, నబిరసూల్, మల్లికార్జున, విజేయుడు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు నృత్యార్చన



సంప్రదాయ నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై విజయవాడ మైలవరానికి చెందిన ఎం.కనకలక్ష్మి వారి కూచిపూడి నృత్యం అలరించింది. కార్యక్రమంలో మూషికవాహన, గణపతికౌత్వం, శివతాండవం, అఖిలాండేశ్వరి, లింగాష్టకం తదితర గీతాలకు శ్రీవాణి, వైష్ణవి, సహస్ర, సిరి, దివ్య, హాసిని, తన్విత, జ్యోతి, తేజ తదితరులు నృత్యాలు ప్రదర్శించారు.

మరబోట్ల లైసెన్స్‌లపై విచారణ



సిద్ధేశ్వరం వద్ద అధికారులు, నిర్వాహకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ నాగజ్యోతి

కొత్తపల్లి: ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణానదిలో లైసెన్స్‌లు లేకుండా మరబోట్ల నడుపుతున్న విషయంపై సోమవారం ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ అధికారి నాగజ్యోతి విచారణ చేపట్టారు. స్వయంగా సంగమేశ్వరం పరిధిలోని సిద్ధేశ్వరం ఘాట్‌ను ఇరిగేషన్, టూరిజం అధికారులతో పరిశీలించారు. అక్కడ సిద్ధేశ్వరం, జానాల గూడెంల మరబోటు నిర్వాహకులతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ కృష్ణానదిలో తిప్పుకొనే ప్రతి మరబోటుకు, డ్రైవర్‌కు తప్పకుండా లైసెన్స్‌లు ఉండాలన్నారు. అందురూ లైసెన్స్‌లు పొందాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ ఉమారాణి, ఎస్‌ఐ ఎం.కేశవ, ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి, టూరిజం అధికారులు ఉన్నారు.

మహానందిలో పల్లకీసేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, పండితులు, అర్చకులు మహానందీశ్వర ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. ముందుగా గణపతి పూజ, అలంకార పూజలు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం నిర్వహించారు.

సైబర్ నేరాలపై అవగాహన

బండి ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై ఎస్‌ఐ జగన్‌మోహన్ అవగాహన కల్పించారు. చెడు స్నేహాల జోలికి వెళ్లకుండా, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా చదువుకోవాలని సూచించారు. చిన్నారులు ప్రతి విషయాన్ని తల్లిదండ్రులతో పంచుకోవాలన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం



మాట్లాడుతున్న పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, పట్టణ నాయకులు సురేంద్ర సూచించారు. సోమవారం సుదర్శనవర్మ భవన్‌లో సీపీఎం గరీబ్ నగర్ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగిస్తోందన్నారు. ప్రత్యేకహోదాను పక్కన పెట్టిందని, వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయడం లేదన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, వీరన్న, సుబ్బయ్య, బాషా, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కెనరా బ్యాంక్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

వెలుగోడు: స్థానిక కెనరా బ్యాంక్ సిల్వర్ జూబ్లీ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. డివిజనల్ మేనేజరు సురేష్ బాబు మాట్లాడుతూ బ్రాంచ్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఏడాది పొదుపు మహిళల ఆర్థిక అభివృద్ధికి రూ.60 కోట్లు, రైతుల పంట రుణాలకు రూ.40 కోట్లు, బంగారు ఖాతాలపై రూ.25 కోట్ల రుణాలు ఇవ్వనున్నామన్నారు. బ్యాంకు సిబ్బంది ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సూర్యదేవ నాయక్, బ్రాంచ్ సిబ్బంది సుభాషిని, షేక్ నూరామద్, నాగరాజు, హుస్సేన్, ఆసిఫ్, ప్రవళిక, లక్ష్మీదేవి, వెలుగు ఇన్‌చార్జ్ ఏపీఓ సుగుణ పాల్, రైతులు ఆదినారాయణ రెడ్డి, రామలింగేశ్వర రెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డివిజనల్ మేనేజర్ సురేష్ బాబు

కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

ఆత్మకూరు: డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానపరిచిన కేంద్ర మంత్రి అమిత్‌షాను పార్లమెంటు నుంచి బర్తరఫ్ చేసి, అరెస్టు చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మాల మహానాడు, గిరిజన సంఘాలతోపాటు, సీపీఎం, సీపీఐ, కేవీపీఎస్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పాత బస్టాండు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాల మహానాడు డివిజన్ నాయకులు మురారి మల్లయ్య, పట్టణ ప్రముఖ వైద్యులు, బీసీ సంఘం సీనియర్ నాయకులు డాక్టర్ నాగన్న మాట్లాడుతూ వ్యాఖ్యలను బట్టి చూస్తే అంబేడ్కర్ పట్ల అమిత్‌షాకు, బీజేపీకి ఉండే వైఖరి స్పష్టమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఇలియాజ్‌ఖాన్, ప్రతాప్, నరసింహ నాయక్, రామ్‌బాలాజీనాయక్, శీలం శేషు, డివిజన్ నాయకులు మురారి, సుధాకర్, క్రిస్టఫర్, సగినాల సురేష్, రాఘవేంద్ర పాల్గొన్నారు.



ఆత్మకూరు: అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలియజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

– **బండి ఆత్మకూరు:** అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో సోమవారం సీపీఎం, మాల మహానాడు ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. అమిత్‌షా చిత్ర పటాన్ని దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు రామచంద్రుడు, దళిత సేన రాష్ట్ర అధ్యక్షురాలు రోజక్క, మండల నాయకులు రత్నమయ్య, మీసేవ రఫి, మహేష్ ఆనంద్, శివరాముడు, సర్దార్ చాంద్ బాషా పాల్గొన్నారు.

గొర్రెల కాపరులను ప్రభుత్వం ఆదుకోవాలి

వెలుగోడు: పల్నాడు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 140 గొర్రె పిల్లలను కోల్పోయి, గాయపడిన గొర్రెల కాపరులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర నాయకుడు రఘురాముడు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని నారాయణపేట జిల్లా ధన్వాడకు చెందిన ఆవుల మల్లేష్‌తోపాటు మరికొందరు పల్నాడు జిల్లాలో నెల రోజులుగా 600 గొర్రెలను మేపుకుంటున్నారన్నారు. ఆదివారం తెల్లవారుజామున పులిపాడు - నడివాడ పంట పొలాల నుంచి పిడుగురాళ్ల వైపు హైవే మీదుగా వెళ్తున్న గొర్రెల మందపై మారుతీ ట్రావెల్స్ బస్సు డ్రైవరు నిద్రమత్తులో దూసుకెళ్లాడన్నారు. ప్రమాదంలో 147 గొర్రె పిల్లల మృతి చెందగా ఇద్దరు కాపరులు గాయపడ్డారన్నారు. బస్సు డ్రైవర్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. నష్టపరిహారం అందజేసి కాపరులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో మండల నాయకులు నాగేశ్వరరావు యాదవ్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకులు

స్వగ్రామానికి సేవ

జూపాడుబంగ్లా: స్వగ్రామంలోని పాఠశాల విద్యార్థులకు మంచి చేయాలనే తలంపుతో గ్రామానికి చెందిన ఒమెగా హాస్పటల్ క్యాన్సర్ స్పెషలిస్టు డాక్టర్ రవీంద్రబాబు, శాంతిరాం హాస్పటల్ నెఫ్రాలజిస్టు డాక్టర్ సాయివాణి దంతపులు రూ.10లక్షలతో భోజనశాల, స్టడీ రూం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సోమవారం మండలంలోని తరిగోపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ రవీంద్రబాబు తండ్రి కృష్ణమూర్తి జ్ఞాపకార్థం స్టడీరూం, భోజనశాల నిర్మాణానికి భూమిపూజచేసి పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్వగ్రామానికి ఏదైన మంచి పనిచేయాలనే తలంపుతో పాఠశాల విద్యార్థుల సౌలభ్యం కోసం తన తల్లి జానకమ్మ, అక్క అరుణమ్మల సహకారంతో రూ.10లక్షలతో విద్యార్థులకు స్టడీరూం, భోజనశాల నిర్మించాలని సంకల్పించినట్లు తెలిపారు. నిర్మాణాల్లో అధిక వ్యయం అయినా భరించి నిర్మాణాలను పూర్తిచేయించి పాఠశాలకు అంకితం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ అంజనమ్మ, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, నాగార్జునరెడ్డి, లక్ష్మన్న, పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్న డాక్టర్ రవీంద్రబాబు, డాక్టర్ సాయివాణి

కొన్న వస్తువుకు బిల్లు తీసుకోవాలి

కొత్తపల్లి: వినియోగదారులు కొన్న వస్తువులకు తప్పకుండా బిల్లు తీసుకోవాలని వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షుడు బొల్లు ప్రసాద్‌బాబు యాదవ్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని శివపురం గ్రామంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పుల్లారెడ్డి ఆధ్వర్యంలో వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా జాతీయ వినియోగదారుల చైతన్య సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత అవసరాలకోసం సరుకులను, సేవలను కొనుగోలు చేస్తే బిల్లులు పొందాలన్నారు. వస్తువులకు బిల్లులు పొందక పోవడంతో ఎంతో మంది మోసపోతున్నారన్నారు. అనంతరం మేలుకొలుపు మాసపత్రికను, రక్షణ చట్టాలను వివరించే కరపత్రాను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శారదమ్మ, ఇందిరా కుమారి, వసంత లక్ష్మి, రాజా ముద్దీన్, పాములేటి పాల్గొన్నారు.

జాతీయ వినియోగదారుల దినోత్సవం

శ్రీశైలంప్రాజెక్ట్: జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని సోమవారం సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హుస్సేన్‌బాషా మాట్లాడుతూ వినియోగదారుడు ఏదైనా వస్తువు కొనుగోలు చేసి నష్టపోతే వినియోగదారుల ఫోరాన్ని సంప్రదించి నష్టపరిహారం పొందవచ్చన్నారు. అధ్యాపకుడు డాక్టర్ ఎం.బుచ్చయ్య మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం 2019 ప్రకారం జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి కమిషన్లకు సాక్ష్యాలతో ఫిర్యాదు చేస్తే కొన్న వస్తువు విలువతోపాటు, తాము ఫిర్యాదుల కోసం ఖర్చుపెట్టిన మొత్తాన్ని కూడా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.



వినియోగదారుల రక్షణ చట్టాల కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

పేద విద్యార్థులకు ఏజీబీవీ చేయూత

మిడుతూరు: విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు కర్నూలు బ్రాంచ్ ఆధ్వర్యంలో విద్యా జ్యోతి పథకం ద్వారా స్కాలర్ షిప్ అందజేస్తున్నట్లు నాగలూటి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకన్న సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా తమ పాఠశాలలో చదివిన ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున వారి అకౌంట్లలో జమ చేశారన్నారు. అయన మాట్లాడుతూ ప్రస్తుతం ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాల, దామగట్ల హైస్కూల్‌లో చదువుతున్న తమ పాఠశాల నుంచి వెళ్లిన విద్యార్థులకు రూ.15 వేలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మమ్మ, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం డ్యాం నీటిమట్టం 862.50 అడుగులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాం నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 862.50 అడుగులకు చేరుకుంది. జలాశయంలో 113.9824 టీఎంసీల నీరు నిల్వగా ఉంది. ఆదివారం నుంచి సోమవారం వరకు జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 7,087 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 0.692 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం నాగార్జునసాగర్‌కు 1,406 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పంప్‌మోడ్ ఆపరేషన్ ద్వారా 6,895 క్యూసెక్కుల నీటిని జలాశయంలోకి మళ్లించారు.

మందుబాబుకు జైలు శిక్ష

బండి ఆత్మకూరు: మండలంలోని కడమల కాలువ గ్రామానికి చెందిన మందుబాబు రామారావు నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి భూపాల్ రెడ్డి 7 రోజులు జైలు శిక్ష విధించారని ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. రామారావు గ్రామంలో మద్యం తాగి చుట్టుపక్కల వారిని అసభ్యంగా తిట్టడతోపాటు గ్రామంలోని కోళ్లను చోరీ చేస్తుండటంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. యువకుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా, జడ్జి 7 రోజుల జైలు శిక్ష విధించారని పోలీసులు తెలిపారు.

అదుపు తప్పిన టాటా ఏస్

బండిఆత్మకూరు: మండల పరిధిలో సంతజూటూరు గ్రామ సమీపంలో ఒక టాటా ఏస్ వాహనం అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. సోమవారం సాయంత్రం నంద్యాల నుంచి వెలుగోడు వైపునకు వెళ్తున్న టాటా ఏస్ వాహనం మార్గమధ్యలో సంతజూటూరు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో డ్రైవర్ బాలస్వామి సురక్షితంగా బయట పడ్డారు.

25న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

ఆత్మకూరు: ఈనెల 25న క్రిస్మస్‌ను పురస్కరించుకుని బాపునంతపురం గ్రామంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలు నిర్వహించనున్నట్లు చర్చి సంఘ పెద్దలు సోమవారం తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10,016, రెండో బహుమతి రూ.5,016, మూడో బహుమతి రూ.3,016, నాలుగో బహుమతి మెడల్స్, షీల్డ్‌లు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 24లోపు రూ.350 ఎంటీఫీజు చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9866936727, 9949544904, 8186802669 నంబర్లను సంప్రదించాలన్నారు.

దేశెట్టి శ్రీనివాసులుకు అవార్డు

నందికొట్కూరు: చిత్రలేఖనం విభాగంలో 20 ఏళ్లుగా ఎంతో మంది విద్యార్థులకు డాక్టర్ దేశెట్టి శ్రీనివాసులు శిక్షణ ఇచ్చారు. ఆయన సేవలను గుర్తించిన తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ వారు సోమవారం విజయవాడలో బందర్ రోడ్‌లోని కాకాని భవన్‌లో ఠాగూర్ గ్రంథాలయం ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో సకల కళా ప్రదర్శనలు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు అందజేశారు. సాంస్కృతిక సేవా సంస్థ జాతీయ చైర్మన్ డాక్టర్ యు.వీ. రత్నం, హైకోర్టు సీనియర్ న్యాయవాది ఉషారాణి తదితర ప్రముఖులు ఘనంగా సన్మానించారు. ఈయన వద్ద శిక్షణ తీసుకున్న 350 మంది చిన్నారులు జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్స్ సాధించారు.

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

కొత్తపల్లి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ మేరీ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్యక్రమంలో భూమి కొలతలకు, మ్యూటేషన్, ఆర్ఓఆర్ సమస్యలపై దరఖాస్తులు వచ్చాయన్నారు. అదేవిధంగా గువ్వలకుంట్ల గ్రామంలో ప్రధాన రహదారి నిర్మాణం మూడు మీటర్లు కాకుండా నాలుగు మీటర్లు వెడల్పు వేయాలని గ్రామస్తుడు సాల్‌మాన్ దరఖాస్తు సమర్పించారన్నారు.

రేషన్ డీలర్ పోస్టుల నోటిఫికేషన్ నిలుపుదల

ఆత్మకూరు: డివిజన్ పరిధిలో రేషన్ షాప్ డీలర్ పోస్టులకు విడుదల చేసిన నోటిఫికేషన్‌ను నిలిపేసినట్లు ఆర్డీఓ నాగజ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు, బండిఆత్మకూరు, వెలుగోడు, శ్రీశైలం, కొత్తపల్లి, మిడుతూరు, నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాల డీలర్ పోస్టులకు ఈనెల 16న ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకున్న వారి దరఖాస్తులను పరిగణలోకి తీసుకుంటామన్నారు. మరలా కొత్త నోటిఫికేషన్ వచ్చినప్పుడు తెలియజేస్తామన్నారు. ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలన్నారు.

పంటల బీమా గడువు పెంపు

ఆత్మకూరు: రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు బీమా చేసుకోవడానికి ఈనెల 31వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వరి, జొన్న, మినుము, వేరుశనగ, ఉల్లి పంటలు సాగుచేసిన రైతులు సీఎస్‌సీ సెంటర్ వద్దకు వెళ్లి తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలన్నారు. పంటలబీమా కింద ప్రీమియం చెల్లించాలంటే రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్ చేయని రైతులకు బీమా వర్తించదన్నారు. రైతులు పంటల బీమాను చేయించుకుని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రిస్మస్‌కు చర్చీల ముస్తాబు



విద్యుద్దీపాలతో అలంకరించిన లింగాపురం చర్చి



ఆకట్టుకున్న ఏసుక్రీస్తు జన్మ వృత్తాంత దృశ్యం

బండిఆత్మకూరు: ఈనెల 25న క్రిస్మస్ వేడుకలకు చర్చిల ముస్తాబయ్యాయి. చర్చిలతోపాటు క్రైస్తవుల ఇళ్లు, ప్రార్థనా మందిరాలు, వీధుల్లో విద్యుద్దీలతో అలంకరించారు. ఏసుక్రీస్తును స్తుతిస్తూ క్రైస్తవులు ప్రత్యేక ఆరాధనలు, ప్రార్థనలు, సెమీ క్రిస్మస్ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. చర్చిలలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తూనే 25 నాటి క్రిస్మస్ వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మరోపక్క క్రైస్తవులు తమ గృహాలను సుందరంగా అలంకరిస్తున్నారు. మండలంలోని స్టార్స్, క్రిస్మస్ ట్రీలు, చర్చిల అలంకరణ సామగ్రి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. చర్చిలలో సండే స్కూల్ పిల్లలు, యువజనులు క్రీస్తు జనన వృత్తాంతాన్ని వివరించే నాటికలు, నృత్యాలు సాధన చేస్తున్నారు.

ప్రారంభమైన వేడుకలు

క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఈ నెలంతా నాటికలు, క్యాండిల్ సర్వీసు వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల యూత్ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు. క్రీస్తు పుట్టుకను వివరిస్తూ మండల పరిధిలోని పలు చర్చిలను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని మననం చేసుకుంటూ క్రైస్తవులు గ్రామాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. మరికొన్ని చోట్ల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

మహానంది: గోపవరం సమీపంలోని సెయింట్ ఆన్స్ మనో వికాస్ కేంద్రంలో సోమవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలు ఆకట్టుకున్నాయి. సెయింట్ ఆన్స్ మనో వికాస్ కేంద్రం ప్రిన్సిపాల్ సిస్టర్ రీనా ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



వేడుకలు చేసుకుంటున్న యువత, చిన్నారులు



గువ్వలకుంట్లలో విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆర్సీఎం చర్చీ

కొత్తపల్లి: క్రిస్మస్ పర్వదినం దగ్గరపడుతున్న వేళ గ్రామాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. సోమవారం రాత్రి మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలో ఆర్సీఎం, సీఎస్ఐ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు జరిగాయి. యువకులు, యువతులు, మహిళలు, భక్తితో వీధుల వెంట ప్రార్థన గీతాలు పాడుతూ సంబరాలు చేసుకున్నారు. క్రిస్మస్ తాత వేషాధారణలో యువకులు, చిన్నారులు సందడి చేశారు.

అల్లూరులో వేడుకలు

నందికొట్కూరు: మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జీ మాండ్ర శివానందరెడ్డి స్వగృహంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే జయసూర్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్యే పాల్గొని కేక్ కట్ చేశారు.

క్రిస్మస్‌కు ముస్తాబవుతున్న చర్చీలు

కొత్తపల్లి: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని క్రైస్తవులు చర్చీలను ముస్తాబు చేస్తున్నారు. మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. విద్యుత్ దీపాల వెలుగులో ప్రార్థనా మందిరాలు కళకళలాడుతున్నాయి. గ్రామాలలో వీధుల వెంట క్రైస్తవులు క్రీస్తు పుట్టుక పాటలు పాడుతూ, బైబిల్ వాక్యాలను పఠిస్తూ, ప్రార్థనలు చేపట్టారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యం

మిడుతూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేస్తే బిల్లులు చెల్లిస్తారా? అని ఎమ్మెల్యేను సర్పంచ్‌లు ప్రశ్నించారు. గ్రామాల్లో సర్పంచ్‌లు అభివృద్ధి పనులు చేపడితే బిల్లులు మంజూరుచేస్తామని ఎమ్మెల్యే సమాధానమిచ్చారు.

శిథిలమైన విద్యుత్ స్తంభాలను మార్చాలి

బైరాపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు నాడు–నేడు కింద నిధులు మంజూరు అయ్యాయని.. అయితే పనులు ఆగిపోయాయని, అదేవిధంగా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరువైన వాటి స్థానంలో నూతన స్తంభాలను ఏర్పాటు చేయాలని నాలుగేళ్లుగా మొరపెట్టుకుంటున్నా చేపట్టడం లేదని సర్పంచ్ ఫణిభూషన్ రెడ్డి నిలదీశారు. మండలంలో పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నప్పటికీ అందులో పశువైద్య సిబ్బంది లేక ఇబ్బందులకు గురవుతున్నట్లు సర్పంచ్ పేరెడ్డి వెంకటరామిరెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ దశరథరామయ్య, హౌసింగ్ డీఈ నాగరాజు, సీడీపీఓ కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య